# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 201 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 16 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# వికాసం నుంచి వైభవం పైపు ఏపీ

## - స్వర్ణాంధ్ర ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం

- అమరావతిలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు
- ముువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించిన సీఎం
- ప్రతిభ కనపర్చిన పోలీసులకు పతకాలు అందించిన ముఖ్యమంత్రి

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 15:** ఆంధ్రప్రదేశ్‌ను వికాసం నుంచి వైభవం వైపు నడిపిస్తున్నామని.. సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 స్వర్ణాంధ్ర సాధన సంకల్పం 5.5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జాతీయత, దేశభక్తితో కూడిన స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి మిగతా2లో...



# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

● ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం ● ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం ● సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేద్ర మోడీ



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 15:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యు ఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. మిగతా2లో...

## భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

- అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాలూ కలిసి పని చేస్తున్నాయి
- అంతర్జాతీయ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం కృషి
- అంతర్జాతీయ స్వాతంత్ర్య వేడుకల వేళ రష్యా అధ్యక్షుడి ప్రశంసలు
- అంతర్జాతీయ ద్రౌపదీ ముర్ము, మోడీలకు పుతిన్ శుభాకాంక్షలు




## రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు

- రాష్ట్రవ్యాప్తంగా క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్
- ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలో వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు తీరనున్న ముడి సరుకు సమస్య




## కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

- అసెంబ్లీలో చర్చిద్దాం రండీ..రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం
- జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు : ముఖ్యమంత్రి
- సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం




**మెదక్,మన జనప్రగతి ఆగస్టు 15:** "తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నిస్తున్నాయి. ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివి. గత ప్రభుత్వంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్.. తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి సాగు చేశాడు. తాము రైతులకు మేలు చేస్తుంటే ఫామ్‌హౌస్‌లో పడుకుని మాపై విమర్శలు చేస్తున్నాడు. సంగారెడ్డి గడ్డ నుంచి సవాల్ చేస్తున్నా.. రైతులకు తాము చేసిన మేలేంటో... మీరు చేసిన అన్యాయం ఏంటో చర్చించేందుకు అసెంబ్లీకి రండీ" అని ముఖ్యమంత్రి మిగతా2లో...

## చట్టబద్ధమైన పాలన, పారదర్శక న్యాయమే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:చీఫ్ జస్టిస్ లీసా గిల్ పిలుపు




**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 15:**రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రాంగణంలో భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘణంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాలు,ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతం త్ర్యం సిద్ధించిందని గుర్తుచేశారు. అమరవీరుల మిగతా2లో...




## చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

- కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ
- ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం
- అన్నిరంగాల్లో ఎపిని ముందువరసలో నిలబెట్టే ప్రయత్నం
- విజయవాడలో జెండా ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

## చరిత్ర తెలుసుకుంటేనే ... భవిష్యత్ నిర్మాణం

### - టీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 15:** చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన మిగతా2లో...

## ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనాలకు నిధుల విడుదల

- రూ.22.50 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం
- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మనకు స్వాతంత్ర్యం అంత తేలికగా ఒక్కరోజులో ఒక్కరి పోరాటంతో రాలేదు. దశాబ్దాల పోరాటం ఎందరో మహనీయుల బలిదానం, మరెందరో అమరవీరుల ప్రాణత్యాగం మనకు స్వాతంత్ర్యాన్ని అందించాయి. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు చూసిన స్వప్నాన్ని సాకారం చేద్దాం. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని నెంబర్ 1 చేద్దామన్న లక్ష్యంతో పనిచేద్దాం. హక్కుల్ని, గౌరవాన్ని ఇచ్చిన దేశానికి మనమేం చేయాలన్న ఆలోచనతో పనిచేద్దాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వచ్చే 20 ఏళ్లు అనునిత్యం పనిచేస్తామని సంకల్పం తీసుకోవాలి. ఈ దేశానికి మనం ఏం ఇవ్వగలం అని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. మనం ఏ పనిచేసినా దేశ భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని, సమాజహితం కోసం పనిచేయాలి. విద్యార్థి ఆవిష్కరణలతో రైతులు ప్రకృతి సాగుతో, ఉద్యోగి అంకిత భావనతో, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. వ్యక్తిగత విజయాలన్నీ దేశ నిర్మాణంలో భాగం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్ లక్ష్యం, మనం రూపొందించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఏపీ దేశానికి బలమైన రాష్ట్రంగా ఎదగాలి. అంతా కలిసి ఐక్యంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిద్దాం. దీనికి దృఢమైన సంకల్పం చేద్దాం". అని ముఖ్యమంత్రి అన్నారు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐ ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి..95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సీఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ 20 వేలు అందిస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం. "అని సీఎం వివరించారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్ టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వ చ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించాం. రాష్ట్రంలో ఆధ్యాత్మికత ను పెంచేందుకు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల పవిత్రతను కాపాడేలా చర్యలు చేపట్టాం. ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాం.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6జి సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు

**రాజమహేంద్రవరం,మన జనప్రగతి ఆగస్టు 15:** మన సాంస్కృతిక, వారసత్వ సంపద అయిన హస్తకళల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని ధవళేశ్వరం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును శాసన మండలి సభ్యులు, స్థానిక శాసన సభ్యులు, అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు రాష్ట్రవ్యాప్తంగా 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు ప్రధాన ముడిసరుకు అయిన కలప కొరత సమస్య నుంచి విముక్తి కలిగించనున్నాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలపను కళాకారుల కోసం అందుబాటులో ఉంచారు. వచ్చే ఐదేళ్లకు సరిపడా కలపను త్వరలో అందుబాటులో ఉంచుతామని అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, మాధవమాల, శెట్టిగుంట కళాకృతులు, బొబ్బిలి వీణల కళాకారుల కోసం ఆయా ప్రాంతాల్లో వుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారు.సతీమణి అన్నా కొణిదెలతో కలిసి వుడ్ బ్యాంకులో సిద్ధంగా ఉంచిన కలప, క్లస్టర్లవారీగా కళాకారులు తయారు చేసిన కళాకృతులను తిలకించారు. పవన్ చొరవతో ప్రతి బొమ్మపైనా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, కళాకారుడి వివరాలు, తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్ద కళాకారులతో ముచ్చ టించి, బొమ్మల తయారీ విధానాన్ని, కళాకారుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వుడ్ బ్యాంకులో నిల్వ ఉంచిన కలప దుంగలపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ దుంగను ఎక్కడి నుంచి సేకరించారు, ఆ చెట్టు వయస్సు, శాస్త్రీయ నామం తదితర వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సతీమణి అన్నా కొణిదలతో కలిసి కళా ప్రదర్శన తిలకించిన ఉప ముఖ్యమంత్రి పలు కళాకృతులు కొనుగోలు చేశారు. శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నీటిపారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ జ్యోతి, కన్జర్వేటర్ ఎన్. నాగేశ్వరరావు, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎనుముల రేవంత్‌రెడ్డి చాలెంజ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన సభలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని హితవు పలికారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా రూ.12 వేల చొప్పున రూ.36 వేల కోట్లను70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.

# చట్టబద్ధమైన పాలన, పారదర్శక న్యాయమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆశయాలకు అనుగుణంగా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అనుభవిస్తూనే, దేశ పౌరులుగా ప్రాథమిక విధులను అంతే బాధ్యతతో నిర్వర్తించడమే మనం ఆ అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆమె పేర్కొన్నారు.భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ,సమానత్వం,సామాజిక న్యాయ సూత్రాలను కాపాడటంలో న్యాయవ్యవస్థ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని జస్టిస్ లీసా స్పష్టం చేశారు.సమాజంలో వెనుకబడిన, నిరుపేద, మరియు బలహీన వర్గాల హక్కులకు భంగం వాటిల్లిన ప్రతి సందర్భంలోను కోర్టులు రక్షణ కవచంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడికి సైతం అత్యంత తక్కువ ఖర్చుతో పారదర్శకంగా వేగవంతమైన న్యాయం అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 15:** భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా దేశాల మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు.భారత అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆండ్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

**విజయవాడ,మన జనప్రగతి ఆగస్టు 15:**ఆగస్టు 15 ఓ తేదీ మాత్రమే కాదని.. చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ అనిఅన్నారు. ఎన్టీఆర్ జిల్లా తరఫున నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ వాతావరణం చూశాక స్కూల్ రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. జెండాలు కట్టి, పోటీల్లో పాల్గొని జెండా పండుగ రోజు బహుమతులు అందుకునే వాళ్లమని చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఇంటి పైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. విద్యా రంగంలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలపై సీఎం ఫొటో, తన ఫొటో లేదని, ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలను వేశామన్నారు. విద్యను ఉపాధి రంగానికి అనుసంధానం చేస్తున్నాం. రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించింది. పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ సాధించాం. అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వానికి జోడెద్దులు. పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి రాష్ట్రానికి చిరునామాగా మారాయి. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంకా ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తాం? అన్నిరంగాల్లో ఏపీని ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రమాణం చేద్దాం. కసితో, పట్టుదలతో పనిచేద్దాం. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా అభివృద్ధి చేద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. అహింసా మార్గం ద్వారా స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మంత్రి కొనియాడారు. ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడం కాదని.. అమరావతి, విశాఖపట్నం, కర్నూలులో ఉద్యోగాలు చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కసితో పని చేసి 2047 నాటికి వికసిత ఏపీని సాధించాలన్నారు. స్వర్ణాంధ్రకు తగ్గట్టుగా ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. పక్క రాష్ట్రం వాళ్లు అసూయపడేలా ఏపీ అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు.వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, కలెక్టర్ లక్ష్మీశా, సీపీ రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

# ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనాలకు నిధుల విడుదల

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 15:** రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం రూ.22.50 కోట్లను మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గౌరవ వేతనాలు చెల్లించేందుకు ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరు నిదర్శనమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇమామ్‌లు, మౌజన్లకు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులు లోకేష్, ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్రంలోని ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుందని, మూడు నెలలకు ఒక్కో ఇమామ్‌కు రూ.30 వేలు, ఒక్కో మౌజన్‌కు రూ.15 వేలు చొప్పున అందనున్నాయని పేర్కొన్నారు. మంజూరైన రూ.22.50 కోట్లను ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోకు విడుదల చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని అబ్దుల్ అజీజ్ తెలిపారు. విడుదలైన నిధులను త్వరతిగతిన ఇమామ్, మౌజన్ లకు అందిస్తామని తెలిపారు.

# చరిత్ర తెలుసుకుంటేనే ...భవిష్యత్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

# తెలుగువారికి చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 15:** పంద్రాగస్టు నేపథ్యంలో తెలుగు వారికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'తెలుగు వారికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమే. అందుకు 'అనే నేను..' సంకల్పంతో దేశం నాకు ఏం చేసిందని కాదు.. దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలి'. 'మన చేతిలో జాతీయ జెండా ఉండాలి.. మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలి. 2047 నాటికి వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. స్త్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు.. వికాసం నుంచి వైభవం వైపు ముందుకు సాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దాం. జై తెలుగుతల్లి! జై హింద్!' అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
16- 08 - 2026

# లోకాయుక్త కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - జాతీయ జెండాను ఆవిష్కరించిన ఉప లోకాయుక్త పి.రజిని



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 15:-** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని లోకాయుక్త కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించేలా అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.కార్యక్రమానికి హాజరైన ఉప లోకాయుక్త శ్రీమతి రజినీ తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ జెండాకు వందనం గావించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు.జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసు సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన గౌరవ వందనాన్ని ఉప లోకాయుక్త స్వీకరించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకాయుక్త కార్యాలయ సిబ్బంది, నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు, అందజేశారు. క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం ప్రాధాన్యతను వివరిస్తూ దేశ అభివృద్ధి, ప్రజాసేవ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పి. వెంకటరామరెడ్డి, రిజిస్ట్రార్ టి. వెంకటేశ్వరరెడ్డి, లోకాయుక్త కార్యాలయ అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 15:-**కర్నూలు జిల్లాలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం కర్నూలు జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం కర్నూలు కలెక్టర్ డా. ఏ. సిరి, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరేడ్‌ను వీక్షించి, సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణ మోహన్, డీఎస్పీలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**సింహాద్రిపురం మన జనప్రగతి ఆగస్టు 15:**సింహాద్రిపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ బి.అనురాధ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,గౌరవ వందనం సమర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించడమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బందిస్థానిక పోలీస్ అధికారులు,సిబ్బందిపాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో సేవలందించాలి..

### ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

### జెండా ఆవిష్కరించిన జడ్పీటీసీ,ఎంపీపీ,ఎంపీడీఓ




**వేముల మన జనప్రగతి ఆగస్టు 15:-**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ..వారి ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ సేవకు అంకితం కావాలని జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి,ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ, ఎంపీడీఓ శారదమ్మ లు పిలుపునిచ్చారు.వేముల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి,ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ,ఎంపీడీవో శారదమ్మ కలిసి ఎగురవేశారు.అనంతరం జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను త్యాగం చేయడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని, దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ స్వాతంత్ర్య స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద ఆయా అధికారులు జాతీయ పతాకాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ ప్రజాప్రతినిధులు,అధికారులు,సిబ్బందికి అల్పాహారం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి,డిప్యూటీ ఎంపీడీవో రంగయ్య, ఇంచార్జి ఏపీఓ మధుసూదన్ రెడ్డి,నాగమల్లారెడ్డి,ఎంపీటీసీలు మరక మల్‌రెడ్డి,రామచంద్రరెడ్డి,బాబ్జాన్,కో-ఆప్షన్ సభ్యులు భాస్కర్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్‌కుమార్,సర్పంచ్ నాగప్ప,రమణ,అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# వేంపల్లెలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

● ప్రభుత్వ విద్యా సంస్థల్లో,కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ ● దేశభక్తి,జాతీయ సమైక్యత చాటుతూ వేడుకలు



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 15:-**80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆయా శాఖ ల అధికారులు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన వేంపల్లె లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో, కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ చేసి, గౌరవవందనం సమర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జల్లా .శివశంకర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, గౌరవవందనం చేశారు. ఎంపిడిఓ కుళాయమ్మ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ టి.నరసింహులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవవందనం సమర్పించారు. విద్యా వనరుల కేంద్ర ఆవరణలో ఎంఇఓలు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్ లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి, గౌరవవందనం చేశారు. స్థానిక జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాలల్లో సంబంధిత హెచ్ఎం లు, ప్రిన్సిపాల్ లు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయ అధికారిణి వనజకుమారి జాతీయ పతాకాన్ని ఎగురవేసి,గౌరవవందనం సమర్పించారు. దీంతో పాటు మండలంలోని ఆయా కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, సేవలను స్మరించుకున్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం మరువలేనిది

### - పత్తికొండలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 15:-**భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు చేసిన త్యాగాలు మరువలేనివని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి టి. జోష్నాదేవి, ఆర్డీఓ చిన్న ఓబులేసు అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత, గర్వకారణమని పేర్కొన్నారు.శనివారం పత్తికొండలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో జూనియర్ సివిల్ జడ్జి టి. జోష్నాదేవి కార్యాలయ ప్రాంగణంతో పాటు సబ్‌జైలు వద్ద మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, పత్తికొండ అర్బన్ సీఐ జయన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు అల్పాహారం పంపిణీ

### హనుమత్ సేవ ప్రతినిధుల దాతృత్వం మరువలేనిది

### గండి ఆలయ కమిటీ చైర్మన్ వెంకటస్వామి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 15:-**గండి అంజన్న భక్తుల కడుపులు నింపడంలో వేంపల్లి హనుమత్ సేవ ప్రతినిధుల దాతృత్వం మరువలేదని గండి వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కల్లూరి వెంకటస్వామి పేర్కొన్నారు. శ్రావణ మొదటి శనివారం సందర్భంగా వేంపల్లి మీదుగా గండికి వచ్చే భక్తులకు వేంపల్లి హనుమత్ సేవ బృంద నిర్వాహకుడుశ్రీ వడ్లకుంట అంజన్ కుమార్ నేతృత్వంలో అల్పాహారము, వేడి పాలు, నీళ్ల ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ వెంకటస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లి వాసులంతా హనుమత్ సేవా పేరిట కమిటీగా ఏర్పాటయి ఐదేళ్లుగా గండి అంజన్న భక్తులకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఎంత డబ్బులు ఉన్నా పదిమందికి పెట్టే గుణం ఉండాలని ఇదే స్ఫూర్తితో ఐదేళ్లుగా హనుమత్ సేవా ప్రతినిధి బృందం ప్రతి శ్రావణమాసంలోనూ వచ్చే శనివారాల్లో భక్తులకు అల్పాహారం అందించడం స్వాగతనీయమన్నారు. వీరిని పలువురు ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు నాగూరు గణపతి రెడ్డి, హనుమత్ సేవా సమితి సభ్యులు వడ్లకుంట అంజన్ కుమార్, పుల్లగూర అరవింద్, మధు, పుల్లగూర గోవర్ధన్, కొరివి సుబ్బారెడ్డి, గోనుగుంట్ల సురేష్, జీకే ఎం ప్రవీణ్, అలిరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యుడు వేంపల్లి ప్రదీప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా నీడన దేశభక్తి చాటిన చిన్నారులు

### అంకాలమ్మ స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### లింగాల పార్వతమ్మ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ



**వేముల మన జనప్రగతి ఆగస్టు 15:-**వేముల మండల పరిధిలోని స్థానిక అంకాలమ్మ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పొన్న రాజాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె చిన్నారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట చరిత్ర,దేశభక్తి, జాతీయ సమైక్యత ప్రాధాన్యతను వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు.దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు.జాతీయ జెండా నీడన చిన్నారులు దేశభక్తిని చాటుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో 'భారత్ మాతాకి జై' అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు.పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# కదిరి రింగ్ రోడ్డు వద్ద 5 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:**కదిరి రింగ్ రోడ్డు సమీపంలో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,పక్కా సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ (HC 837) జి.మల్లారెడ్డి తన సిబ్బందితో కలిసి కదిరి రింగ్ రోడ్డు వద్ద నిఘా ఉంచారు.ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు.అప్రమత్తమైన పోలీసులు అతన్ని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన వ్యక్తిని లింగాల గ్రామం మరియు మండలానికి చెందిన బాలసముద్రం నవీన్ (తండ్రి: కృష్ణయ్య)గా గుర్తించారు.అతని వద్ద తనిఖీలు చేపట్టగా 5 లీటర్ల నాటుసారా లభ్యమైంది.సారాతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకొని,కేసు నమోదు చేసిన అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఎస్ఐ ప్రవీణ్‌కు సేవా పురస్కారం

● విధి నిర్వహణలో ప్రతిభకు లభించిన ప్రశంస ● స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి చేతుల మీదుగా ఘనంగా సత్కారం



**వేముల మన జనప్రగతి ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించిన సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బందికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా వేముల ఎస్ఐ ప్రవీణ్ ఉత్తమ సేవలకు గాను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించినందుకు ఎస్ఐ ప్రవీణ్‌కు ఈ గుర్తింపు లభించింది. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడంలో ఆయన చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.ఈ ప్రశంసా పత్రం ఎస్ఐ ప్రవీణ్ సేవలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా పురస్కారం అందుకున్న ప్రవీణ్‌కు అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 15:-** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని ఆదివారం రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.రాష్ట్ర స్థాయి వేడుకలను విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న లచ్చన్న, జమీందారీ వ్యవస్థ రద్దు, రైతులు, బీసీల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని మంత్రి గుర్తుచేశారు.ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**- జిల్లా కలెక్టరేట్ నందు జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్**





**తిరుపతి మన జనప్రగతి ఆగస్ట్15:** శనివారం ఉదయం 80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నందు జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్,శివ శంకర్ నాయక్, రామాంజునమ్మ, ట్రైని డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగిగా పరమేష్



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 15:**-విద్యుత్ శాఖలో జూనియర్ లైన్మెన్ గా పనిచేస్తున్న ఎం.పరమేష్ కు ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రం లభించింది.శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్.ఈ ప్రదీప్ కుమార్ చేతులమీదుగా ఏం.పరమేష్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పత్తికొండ మండల పరిధిలోని చిన్న ఉలితి పెద్దవులతి గ్రామాలలో జూనియర్ లైన్మెన్ గా పరమేష్ విధులు నిర్వహిస్తున్నారు.ప్రజలకు మంచి సేవలు అందించి, విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో తనకు ఈ ప్రశంసా పత్రం లభించిందని పరమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులు, సహ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## కనుమల్లోపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి గాయాలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 15:**-కడపచెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం కనుమల్లోపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. కడప నగరంలోని అశోక్నగర్కు చెందిన ఆరుగురు ఆటోలో రాజంపేటకు వెళ్తుండగా, కనుమల్లోపల్లి వద్ద ఆటో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో జుబేద్, కరీముల్లా సహా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. స్థానికులు 108 అంబులెన్స్లో క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్కు తరలించారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

## త్యాగధనులు ఆదర్శంగా యువత ఉన్నత స్థానానికి ఎదగాలి

**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 15:**-భారతదేశ స్వాతంత్రం కోసం ధన, మాన, ప్రాణాలను అర్పించిన త్యాగధనులను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత స్థానానికి ఎదగాలని చిట్వేలి మండల రెవెన్యూ అధికారి నరసింహారావు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చిట్వేలి ఎంఆర్ఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. చిట్వేలి పోలీస్ స్టేషన్ నందు సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చిట్వేలి పారిశుద్ధ్య కార్మికులను శాలువా కప్పి సన్మానించి స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ స్థానాలను పొందిన విద్యార్థులకు మెమెంటో అందజేసి సత్కరిం చారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎంఈఓ ఖాజా మొహిద్దీన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ శివ ప్రసాద్ గౌడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



# పులివెందుల వైఎస్సార్సీపీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**● జాతీయ జెండా ఆవిష్కరించిన వైఎస్ మనోహర్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:**పులివెందులలోని జగన్ క్యాంపు ఆఫీస్ నందు శనివారం ఉదయం 8గంటలకు 80వ భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో జాతీయ జండా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలు గా మున్సిపల్ ఇంచార్జి వై.ఎస్ మనోహర్ రెడ్డి,తొండూరు మండల ఇంచార్జి వై.ఎస్ మదన్ మోహన్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టిన వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జనగణమన జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూస్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్ కోడి రమణ,కడియాల లక్ష్మీనారాయణ,కనక, చంద్రమౌళి,ఈశ్వరయ్య,ఓ రసూల్,కోళ్ల భాస్కర్, శ్రీరాములు,బ్యాటరీ ప్రసాద్, చెన్నకేశవులు,వైసిపి నాయకులు,కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ద

# ఎందరో పుణ్యమూర్తుల ప్రాణ త్యాగఫలమే

**భారతదేశ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**

**కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి,ఎమ్మెల్యే అరవ శ్రీధర్లు**





**ఓబులవారిపల్లి మన జనప్రగతి ఆగస్టు 15:-** ఎంతోమంది త్యాగమూర్తులు ప్రాణాలర్పించి స్వాతంత్ర దినోత్సవాన్ని భారతదేశానికి తీసుకురావడంలో ఎంతో కృషి ఉందని కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ఒక్క రూపానంద రెడ్డి అన్నారు శనివారం ఆగస్టు 15 నా స్వాతంత్ర దినోత్సవ శీ సందర్భంగా ఓబులవారిపల్లి తాసిల్దార్ మరియు ఎంపీడీవో కార్యాలయాలలో ఆయన భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు కార్యక్రమానికి రైల్వే కోడూరు శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశాన్ని కొంతమంది విదేశీయులు వ్యాపారం నిమిత్తం కొరకు అలాగే మరి కొంతమంది మొగల్ చక్రవాతులు గతంలో దేశాన్ని పీడించి సంపదను దోచుకు వెళ్లారని ఆ తర్వాత బ్రిటిష్ వారిని ఎదిరించి ఎంతోమంది పుణ్యమూర్తులు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా భారత దేశ స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారని నేడు స్వాతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామంటే ఆ పుణ్యమూర్తుల త్యాగఫలమైన అన్నారు అంబేద్కర్ ఆశయాలతో భారతదేశంలో ఉండే యువత బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని భారత దేశ ఔన్నత్యాన్ని ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పే విధంగా నేటి పౌరులు ఎదగాలన్నారు వాడవాడల త్రివర్ణ పతాకం ఎంతో గర్వంగా ఎగిరిందన్నారు ఎంపీపీ చీరల నాగమ్మ తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఎంపీడీవో రాజేంద్ర ఈవో పి ఆర్ డి రామ్మోహన్ రెడ్డి ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ కోటమి నాయకులు వాసుదేవ రెడ్డి, సుబ్బరాజు రమేష్ నాయుడు గజేంద్రనాయుడు సుబ్బారాయుడు నూక పాపులర్ బాబుల్ రెడ్డి అధికారులు ఆర్ ఐ మల్లికార్జున్రెడ్డి వీఆర్వోలు కార్యకర్తలు నాయకులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## ప్రతిభకు పట్టం..ఓబులవారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వర రావుకు ఉత్తమ సేవలకు ప్రశంస పత్రం




**ఓబులవారిపల్లి మన జనప్రగతి ఆగస్టు 15:-** తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండల తాసిల్దారుగా విధులు చేపడుతున్న ఆకుల సిద్దేశ్వర రావుకు ఆయన ప్రతిభను గుర్తించి విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గాను భారత దేశ 80 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు చేతులు మీదుగా ఉత్తమ ప్రశంశాపత్రాన్ని తాసిల్దార్ సిద్దేశ్వర రావు అందుకున్నారు వివిధ డివిజన్లో దాదాపు ఆరు సంవత్సరాలుగా డిప్యూటీ తాసిల్దారుగా కలెక్టరేట్ కార్యాలయాలలో విధులు చేపట్టి ఓబులవారిపల్లి తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వివిధ శాఖలలో విధి నిర్వహణలో. నిష్పక్షపాతముగా విధులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో దీటుగా నిలబడడంతో ఆయన సేవలకు గుర్తించి ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న తాసిల్దార్ కు ప్రత్యేకంగా మండల నాయకులు రెవెన్యూ అధికారులు సిబ్బంది అన్ని శాఖల అధికారులు హర్షశీ వ్యక్తం చేశారు అలాగే అభినందనలు తెలిపారు


# భాకరాపేటలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**భాకరాపేట మన జనప్రగతి ఆగస్టు 15:**-భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎన్. వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు.అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెంకటరమణ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో అటవీ శాఖ సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు.దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఆఫీసర్ చైతన్య, ఎఫ్ఎస్ఓ బి. మునిస్వామి నాయక్, ఎఫ్బీఓలు కే. లక్ష్మీ ప్రసాద్, ఎం.ఎల్. సదాశివయ్య, వై. రాజేష్కుమార్, జి. ప్రదీప్చంద్, జే.బి. నిఖిల్తో పాటు సీబీఈటీ, బేస్ క్యాంప్ సిబ్బంది, రక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జాతీయ జెండా వందనం

**- త్యాగధనుల ఫలమే భారతావనికి స్వేచ్ఛా వాయువులు: ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:** పులివెందుల పట్టణ పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ట్రాఫిక్ సిఐ ప్రసాద్ నేతృత్వంలో శనివారం ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, పోలీసు సిబ్బంది చేతుల మీదుగా జాతీయ జెండాకు సెల్యూట్ చేసిజాతీయ జెండా వందనం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా,ఉదయం 8 గంటలకే జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తుల ఫలం స్వేచ్ఛ భారతదేశ స్వాతంత్రం అని,స్వాంతంత్ర్య సమరయోధులు కలలుగన్న నవభారత నిర్మాణమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 15:-** లింగాల మండల పరిధిలోని గ్రామాల్లో వాడవాడల 80 వ గణతంత్ర దినోత్సవం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. దీంతో వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 80వగణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సై డి జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రామచంద్రుడుఅలాగే ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రం లింగాలలో డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ గౌతమి ఆయా కార్యాలయాల్లో వారి సిబ్బందితో జాతీయ పతాకాన్ని ఉదయము ఎనిమిది గంటలకు ఎగరవేశారు. మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా సంబంధిత ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన సమరయోధుల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

# కాకినాడ జిల్లాలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**● ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**






**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 15:** కాకినాడ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ జి బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేడుకల్లో పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శకటాల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ అందజేశారు. జిల్లాలో విశిష్ట సేవలు అందించిన 242 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సతీమణి అన్నా కొణిదెల, లోక్సభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు. కుడా చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డీఆర్వో డాక్టర్ పి తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. చివరగా వందేమాతరం గేయం, జాతీయ గీతాలాపనతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిశాయి.

# న్యూ సెంచరీ స్కూల్లో స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 15:**-80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూ సెంచరీ స్కూల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా వినియోగదారుల ఫారం నెంబర్ చక్క సుశీ,హాజరయ్యారు. ఈ వేడుకలో స్కూలు విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులను ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత ప్రాముఖ్యత చాలా ఉందని ఎంతోమంది చాగదునుల చాగపలమే ఈరోజు మనం అందరం అనుభవిస్తున్న ఈ స్వతంత్ర ఫలితమని అన్నారు.అలాగే ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి దేశం యావత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచేలా చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో అకాడమీ హెడ్ వాడపల్లి తేజ,అడ్మినిస్ట్రేషన్ హెడ్ నల్ల శ్రీదేవి,స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

# మాధవరం-1 బస్టాండులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

● సాంస్కృతిక వేషధారణలో విద్యార్థుల ర్యాలీ..అమరవీరులకు ఘన నివాళి





**సిద్దవటం మన జనప్రగతి ఆగస్టు 15:-**మండలంలోని మాధవరం-1 బస్టాండులో ప్రజలు, విద్యార్థులు కలిసి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం గ్రామంలోని ఎస్.పి.బి.వి.డి. సభా హైస్కూల్ విద్యార్థులు తొలుత పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం వివిధ భారతీయ సాంస్కృతిక వేషధారణలో, త్రివర్ణ పతాకాలు చేతబట్టి, దేశభక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీగా మాధవరం-1 బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండా వందనం కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, మేరువ జయరామయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'అమరవీరులకు జోహార్లు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, వారి త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పెగడ హరి, పాలూరు మల్లికార్జున, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ద

# భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోంది: వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్



**కడప మన జనప్రగతి ఆగస్టు 15:-**దేశం వివిధ రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తూ ప్రపంచ నాయకత్వం దిశగా పయనిస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన వీసీ బెల్లంకొండ రాజశేఖర్ గౌరవ వందనం స్వీకరించి, వందేమాతరం, జనగణమన గీతాలను ఆలపించారు. అనంతరం మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తదితర మహనీయుల సేవలను కొనియాడారు.వైద్యం, అంతరిక్షం, విజ్ఞానం, సాంకేతికత, వ్యవసాయం వంటి రంగాల్లో భారత్ విశేష ప్రగతి సాధించిందని, వికసిత్ భారత్, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా నాణ్యమైన ఉన్నత విద్య అందించడంలో విశిష్ట స్థానం సంపాదించిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పలు ఐఎస్ఓ ధృవపత్రాలు, నాలుగు నక్షత్రాల నాణ్యత రేటింగ్‌ను విశ్వవిద్యాలయం పొందిందని చెప్పారు.విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవాల్లో విద్యార్థులకు డిగ్రీలు, బంగారు పతకాలు అందజేసినట్లు తెలిపారు. ఏఎన్ఆర్ఎఫ్‌పిఏఐఆర్ ప్రాజెక్టు కింద రూ.1.74 కోట్ల గ్రాంటు లభించిందని, పీఎం ఉష పథకం ద్వారా పలు శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.జాతీయ విద్యా విధానం2020కు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. నెట్, జేఆర్ఎఫ్, ఏపీ సెట్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సవిత చేతుల మీదుగా 'ఉత్తమ సీఐ' అవార్డు

● కదిరి అర్బన్ సీఐ వెంకటేశ్వర్లుకు ఘన సత్కారం



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 15:-** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కదిరి అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. శనివారం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సవిత ఆయనకు 'ఉత్తమ సీఐ' అవార్డును ప్రదానం చేశారు.అనంతరం యూనిఫాంపై బ్యాడ్జ్‌ను అలంకరించి ఘనంగా అభినందించారు.**నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తింపు** వెంకటేశ్వర్లు ఉరవకొండ, గుత్తి, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో పోలీసు అధికారిగా అందించిన సేవలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఉరవకొండలో ఎస్సై, సీఐ హోదాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుని ప్రత్యేక అభిమానాన్ని సంపాదించారు. గుత్తిలో శాంతిభద్రతల పరిరక్షణలో కఠిన నిర్ణయాలు తీసుకుంటూ తనదైన శైలిని చాటుకున్నారు.పుట్టపర్తిలో వివాదాలకు తావులేకుండా నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ మంచి అధికారిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం కదిరి అర్బన్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తూ 'ప్రజల అధికారి'గా ప్రశంసలు అందుకుంటున్నారు.**కఠినతలోనూ మానవత్వం..** విధుల నిర్వహణలో ఎంత కఠినంగా ఉంటారో..ప్రజల పట్ల అంతే మానవత్వంతో వ్యవహరించడం వెంకటేశ్వర్లు ప్రత్యేకతగా పలువురు పేర్కొంటున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 'ఉత్తమ సీఐ' అవార్డు లభించడం పట్ల ఉరవకొండ, గుత్తి, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# టీడీపీ కార్యాలయం వద్ద ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 15:-** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడారు. అనంతరం గాంధీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ ముక్తియార్, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనికులు, నందమూరి అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# చెన్నూర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

చెన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో పతాక ఆవిష్కరణ చేసిన తాసిల్దార్,విజయ కుమారి



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 15:-** చెన్నూరు మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు గ్రామపంచాయతీలు సచివాలయాలు బ్యాంకులు ఘనంగా నిర్వహించారు,చెన్నూరు తాసిల్దార్ కార్యాలయం ఆవరణంలో జాతీయ పతాకాన్ని తాసిల్దార్ విజయ కుమారి ఆవిష్కరించారు, చెన్నూరు పోలీసులు హాజరై కవాతు నిర్వహించారు,ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి,వైసిపి మండల కన్వీనర్ జి ఎన్ భాస్కర్ రెడ్డి, వీఆర్వోలు ఆర్ ఐ డిప్యూటీ తాసిల్దార్ వీఆర్ఏలు డీలర్లు హాజరయ్యారు, చెన్నూరు పోలీస్ స్టేషన్లో సీఐ చాంద్ భాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, పోలీసులు వందన కవాత్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్సై సుభాష్ చంద్ర ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్ లు పోలీసులు పాల్గొన్నారు,చెన్నూరు ఎంపీడీవో ఎం ఆర్ సి కార్యాలయాలు ఎదుట జాతీయ పతాకం ఎంపీడీవో పతాకావిష్కరణ చేశారు,ఎంఈఓ లు జే సునీత,ఎన్ సునీత, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు,చెన్నూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధికారి,జగదీశ్వర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు,గ్రామపంచాయతీ సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు,చెన్నూరు ముస్లిం వాడలోని మంబా- ఉల్- ఉలూమ్ మదరస లో సీఐ చాంద్ బాషా జాతీయ పతాకం ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో మదరస పెద్దలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ పతాకాలు రెపరెపలాడాయి, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు,

# రైల్వే కోడూరు నియోజకవర్గానికి..ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాల పంట పండింది



**ఓబులవారిపల్లి మన జనప్రగతి ఆగస్టు 15:-** రైల్వే కోడూరు నియోజకవర్గంలో పోలీస్ శాఖలో ప్రతిభకు పట్టం కట్టారు 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు ఎస్పీ సుబ్బరాయుడు చేతులు మీదుగా రైల్వే కోడూరు రూరల్ సిఐ శ్రీనివాసులు కు అలాగే పలువురు ఎస్సైలకు చిట్వేల్ పరిధిలో ఉన్న ఎస్బి హెడ్ కానిస్టేబుల్ హేమాద్రి కి అతి ఉ క్రిష్ట ప్రతిభ అవార్డు ప్రశంసా పత్రాన్ని అందజేశారు అలాగే డివిజన్లో నలుగురు ఎస్ఐలకు విధులు పట్ల అంకితభావంతో పనిచేసినందుకు ఉత్తమ సేవలను గుర్తించి స్వాతంత్ర వేడుకల్లో భాగంగా వారికి ఉత్తమ సేవ పురస్కార పత్రాలను అందజేశారు రైల్వే కోడూరు కి ప్రశంసా పత్రాల పంట పండిందని పలువురు మేధావులు నాయకులు తోటి పోలీస్ శాఖ సిబ్బంది అధికారులు హర్షివి వ్యక్తం చేస్తున్నారు రైల్వే కోడూరు సిఐ అన్ని విధాల ఎప్పుడు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించి సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలు చూపుతున్నారని పలువురు హర్షి శీవ్యక్తం చేస్తున్నారు

# సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

చదువుతో పాటు సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలన్న సీఐ పులి శేఖర్



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 15:-**పత్తికొండ నియోజకవర్గంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఐ పులి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువును పూర్తి చేసుకున్న అనంతరం సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ప్రశ్నించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ సైనికుడి జీవిత చరిత్రను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుందని సీఐ పులి శేఖర్ అభినందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బ్రదర్ జాన్, ఫాదర్ లూర్దయ్య, మదర్ సిరీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఆలూరు మన జన ప్రగతి ఆగస్టు 15:** ఆలూరు మనతెలుగుదేశం పార్టీ కార్యాలయంవద్ద 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఘనంగా ముగిసాయి.ముఖ్య అతిథిగా విచ్చేసిన మన ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి ముప్పన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి, అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత మరియు అభిమానులు.ఈ కార్యక్రమానికి వేళకు హాజరై,జాతీయ జెండాకు వందనం చేసి,వేడుకలను దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు పాల్గొన్న ఆర్గనైజేషన్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాదు టిడిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూఏ పులివెందుల కళాశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:** స్థానిక జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్,వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శేష మహేశ్వరమ్మ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు.వారి త్యాగాలను స్మరించుకుంటూ, దేశాభివృద్ధిలో విద్యార్థులు, యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ ఎం.సాంబయ్యతో పాటు అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదోని డివిజన్ తూనీకల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులుకు ఉత్తమ సేవ ప్రశంస పత్రం



**కర్నూలు బ్యూరో ఆదోని మన జనప్రగతి ఆగస్ట్ 15:-**80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్ కర్నూల్ లో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ చేతుల మీదుగా ఆదోని డివిజన్ తూనీకల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు ఉత్తమ సేవ ప్రశంస పత్రం అందుకున్నారు. ప్రశంస పత్రం అందుకున్న శ్రీనివాసులకు జిల్లా డిఎస్ఓ రాజా రఘువీర్, తూనికల్లా కొలతల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దయాకర్ రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ రాముడు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఈసబాషా మరియు సంబంధిత శాఖ అధికారులు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# విధి నిర్వహణలో ప్రతిభకు సీఐ వెంకటేశ్వర్లుకు మెరిట్ సర్టిఫికెట్



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఆగస్టు 15:-**విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ, అంకితభావం, క్రమశిక్షణతో పాటు సమర్థవంతమైన సేవలు అందించినందుకు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లుకు మెరిట్ సర్టిఫికెట్ లభించింది. కడప జిల్లాలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రిబీసీ జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, సమర్థవంతమైన పర్యవేక్షణలో చూపిన చొరవకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది సీఐ వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ గౌరవం మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన తెలిపారు.

## అరుణాచల హాస్పిటల్‌లో పంద్రాగస్టు వేడుకలు



**కడప మన జనప్రగతి ఆగస్టు 15:**-భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కడప నగరంలోని అరుణాచల హాస్పిటల్ నందు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జాతీయ పతాకానికి సెల్యూట్ చేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయుల బలిదానాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న వీర జవాన్ల సేవలను కొనియాడుతూ, వైద్యులు మరియు ఆరోగ్య సిబ్బంది సమాజానికి అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అరుణాచల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నిరంజన్ రెడ్డి డాక్టర్ మమతేశ్వరి. ఏవో కోటిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో ఆగస్టు 15 సంబరాలు



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 15:**-80 స్వతంత్ర దినోత్సవ సందర్భంగా కాకినాడ జిల్లా గ్రంథాలయం ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కె. జె, ఎల్, కుమారి గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భూపతి రాజు మాట్లాడుతూ ఎంతోమంది చాగజనుల ఫలమే ఈరోజు మనం ఈ స్వతంత్ర దినోత్సవం ప్రతిఫలం అని వారు చేసిన చాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని వారి చాగఫలం మన భారతదేశ యావత్ ప్రపంచంలోనే ముందంజ లో ఉండేందుకు వారే స్ఫూర్తిదాయకమని అన్నారు. నేటి విద్యార్థులు గ్రంథాలయాల యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రతి ఒక్కరూ గ్రంథాలయలలో చదువుకొని ఉన్నత స్థాయిలోకి రావాలని రేపటి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్టు భూపతి రాజు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్త బయారెడ్డి పార్థీవ దేహానికి నివాళులు



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 15:** గాలివీడు మండలం తూముకుంట పాపిరెడ్డిగారి పల్లె కు చెందిన వైసీపీ కార్యకర్త బయారెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే ఆయన స్వగ్రామం చేరుకొని బయారెడ్డి పార్థివ దేహానికి రాష్ట్ర లీగల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, గాలివీడు మండల అధ్యక్షులు మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి లు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వైసీపీ నాయకులు మద్దిరాల భానుమూర్తి రెడ్డి, కుడుముల ఆంజనేయ రెడ్డి, ధర్మా రెడ్డి వాటర్ షెడ్ చైర్మన్ రమణా రెడ్డి,వైసీపీ నాయకులు చింతం రెడ్డి రామాంజులు రెడ్డి, వల్లెపు నగేష్, రంగం రెడ్డి రామాంజులు రెడ్డి,శివారెడ్డి, శ్రీహరి నాయుడు, కూరగాయల సుబ్బారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ నల్లాబత్తుని వెంకట రెడ్డి తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



## పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం

**● మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన టీడీపీ,కూటమి నేతలు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మారెడ్డి భరత్ రెడ్డి, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి,వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం అందరూ కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో మహనీయుల పోరాటాలను, త్యాగాలను స్మరించుకున్నారు.స్వాతంత్ర్యం అంటే కేవలం హక్కులు మాత్రమే కాదని,అది దేశం పట్ల మనకున్న బాధ్యత అని నేతలు స్పష్టం చేశారు. మహనీయుల త్యాగఫలమైన స్వేచ్ఛను కాపాడుకుంటూనే,సమాజ ప్రగతి,రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రాబోయే తరాలకు మరింత బలమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని అందించేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో కూటమి నాయకులు,పార్టీ కార్యకర్తలు,అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.దేశభక్తి నినాదాలతో పులివెందుల టీడీపీ కార్యాలయ ప్రాంగణం మార్మోగింది.

## కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి..!

**● రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి**

**● ఈనెల 18న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి:సీపీఐ నేతలు**





**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 15:**-కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, రైతుల సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 15వ తేదీ వరకు చేపట్టిన ప్రచార పాదయాత్రలు మద్దికేర మండలంలో కొనసాగాయి. మదనంతపురం, బస్నేపల్లి, పెరవలి గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించి రైతుల సమస్యలను ప్రజలకు వివరించారు.కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈనెల 18న నిర్వహించనున్న చలో కలెక్టరేట్, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి. రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజాసాహెబ్ తదితరులు మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

## పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం: డీఎస్పీ బి.మురళీ నాయక్**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పులివెందుల డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ బి.మురళీ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.ఈ వేడుకల్లో అర్బన్ సీఐ శ్రీరామ్,రూరల్ సీఐ శాంతి లాల్,అర్బన్ ఎస్సైలు మధుసూదన్ రెడ్డి తిమోతి లతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం డీఎస్పీ బి.మురళీ నాయక్ మీడియా సమావేశంలో మాట్లాడుతూపోలీసులు కేవలం ఉద్యోగ బాధ్యతలే కాకుండా నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని,ప్రజలతో శాంతియుతంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు.కడప జిల్లా ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలో పలు కీలక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రతి సబ్ డివిజన్ మరియు నియోజకవర్గ పరిధిలో పక్కా కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారన్నారు.మారుతున్న నేరాల సరళిని అరికట్టడానికి సీఐ,డీఎస్పీ స్థాయి అధికారులు డ్రోన్ కెమెరాలు మరియు నిరంతర సీసీ కెమెరాల నిఘాను వినియోగించుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు అసాంఘిక కార్యకలాపాలు,చోరీలు,హత్యలు,సైబర్ నేరాలు (డిజిటల్ అరెస్ట్),సోషల్ మీడియా నేరాలను పక్కాగా ఛేదించేందుకు సిబ్బందికి నిరంతరం దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా 'ఫేమ్ ఇండియా' సంస్థ నిర్వహించిన సర్వేలో ఎంపికైన టాప్ 100 ఉత్తమ ఐపీఎస్ అధికారులలో కడప జిల్లా ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ స్థానం సంపాదించడం జిల్లా పోలీసులకు,ప్రజలకు ఎంతో గర్వకారణమని అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ,ఆక్సిజన్ ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చే లక్ష్యంతో ప్రపంచ సైకిల్ యాత్ర చేపట్టిన తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వన్ పాల్గొనడం జరిగింది.ముత్తు సెల్వన్ డీఎస్పీ మురళీ నాయక్‌తో పాటు స్థానిక సీఐలు,ఎస్సైలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయన చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సంకల్పాన్ని పోలీసులు అభినందించి,తమవంతుగా చేయూత,ఆర్థిక సహాయ సహకారాలను అందించారు.పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొని మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు.

## ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**కడప మన జనప్రగతి ఆగస్టు 15:**-ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కడపలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు అమిత్ సింగ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే కేవలం హక్కులు మాత్రమే కాదని, బాధ్యతలను స్వీకరించి దేశ అభివృద్ధికి కృషి చేయడమే నిజమైన స్వాతంత్ర్యమని అన్నారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోటీలో ఉపాధ్యాయుల జట్టు విజయం సాధించింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## కుంకనూరులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 15:**-దేవనకొండ మండలం కుంకనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు బోయ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, జాతీయ సమైక్యత, ప్రజల బాధ్యతలపై ప్రసంగించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తడకల లక్ష్మన్న, ఆర్. రమణగౌడ్, మాజీ సర్పంచ్ కురువ అంజనేయులు, ఈ. రాజగోపాల్ గౌడ్, చిన్న రామప్పరెడ్డి, ఆర్. పంపనగౌడ్, అంపయ్య, సుభాన్, పెద్ద గౌడప్ప, ఆర్. లింగారెడ్డి, షేక్ అన్నా, జనసేన నాయకుడు వడ్డే రామాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు లింగమూర్తి, రామ్ లక్ష్మణ్, బీజేపీ నాయకుడు సత్తార్, గ్రామ ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

**నేటి తరాలకు త్యాగమూర్తుల త్యాగాలను చెప్పాలి: డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె మన జన ప్రగతి ఆగస్టు 15:**-కుల మతాలకతీతంగా స్వాతంత్ర దినోత్సవ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, స్వాతంత్రం కోసం పాటుపడిన త్యాగమూర్తుల గురించి నేటి తరాలకు వివరించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. వేంపల్లి లో శనివారం కాంగ్రెస్ నాయకులు 80వ భారత స్వాతంత్ర దినోత్సవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.భారతమాత ముద్దుబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు దేశద్రోహుల కారణంగా దాదాపు 200 ఏళ్లపాటు భారతీయులు బానిసత్వాన్ని అనుభవించారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, లాలా లజపతిరాయ్,బాలగంగాధర్ తిలక్,బిపిన్ చంద్రపాల్,మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్,నేతాజీ సుభాష్ చంద్రబోస్, నీలం సంజీవరెడ్డి,భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర ఎంతోమంది యువకుల, దేశభక్తుల,వీరమాతల, స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితంగా 80 సంవత్సరాల కిందట 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి భారతీయులకు స్వాతంత్రం లభించిందన్నారు.అప్పటినుండి ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని తులసి రెడ్డి అన్నారు.మనకు అనేక పండుగలు ఉన్నప్పటికీ ఆగస్టు 15 నాటి భారత స్వాతంత్ర దినానికి,జనవరి 26వ తేదీ నాటి గణతంత్ర దినోత్సవానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని,ఇవి కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా భారతీయుల అందరి పండుగలని పేర్కొన్నారు .మనకు స్వాతంత్రం వచ్చే నాటికి తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టడానికి బట్ట,త్రాగడానికి నీరు, చదువుకోడానికి స్కూలు ఆరోగ్యపరిరక్షణకు ఆసుపత్రులలో ఎలాంటి కనీస వసతులు లేవన్నారు.మన నాయకుల దూరదృష్టి వల్ల,పరిపాలనా దక్షత వల్ల ఈ 80 సంవత్సరాల లో అద్భుతమైన ప్రగతి సాధించామన్నారు. ఈ స్వాతంత్రాన్ని, అభివృద్ధిని పరిరక్షించుకుంటూ మరిన్ని మెరుగులు దిద్ది భావితరాల వారికి అందించాల్సిన పవిత్రమైన బాధ్యత నేటి తరానికి చెందిన మన మీద ఉందన్నారు. ఈనాటి బాలలే రేపటి పౌరులు. ఈనాడు వారు నేర్చుకున్న సుగుణాలే రేపటి ఆదర్శ కిరణాలు. విద్యార్థులలో జాతీయతా భావాన్ని పెంపొందించాలని, మనమంతా భారతీయులం అన్న భావన రావాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశు,చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య,బద్రీనాథ్ రాఘవయ్య, రవి, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
16- 08 - 2026

# పులివెందుల బీజేపీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## దేశమే మొదటి ప్రాధాన్యత అనే స్ఫూర్తితో ప్రతి పౌరుడూ దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలి: బీజేపీ మండల అధ్యక్షుడు వై.నవీన్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వై. నవీన్ ఆధ్వర్యంలో 'ప్రతి ఇంటికి త్రివర్ణ పతాకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వై. నవీన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "దేశమే మొదటి ప్రాధాన్యత" అనే స్ఫూర్తితో ప్రతి పౌరుడూ దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఐక్యతతో ముందుకు సాగుతూ, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించి స్వయం సమృద్ధి భారత్‌ను నిర్మించాలని తిరంగా మన గర్వం భారత్ మన గౌరవం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. యువత దేశానికి వెన్నెముక వంటిదని, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందడుగు వేసి 'వికసిత్ భారత్' నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తెర మహేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, శ్రీరాములు, లక్ష్మయ్య, తిరుపాల్, తరుణ్ మరియు ఇతర పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివి

## - ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 15:-** గాలివీడులోని రవిచంద్ర సి.బి.ఎస్.ఈ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పిల్లి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిల్లి నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో విద్యలో రాణించి దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానెయిల్, సైజు థామస్, ప్రిన్సిపాల్ లీజా జాయ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను శిక్షించడం కాదు..సమస్య పరిష్కరించాలి..!

- ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సమస్యపై ప్రభుత్వం స్పందించాలి
- ఢిల్లీ వెళ్లిన ఉపాధ్యాయులపై చర్యలు ఉపసంహరించాలి
- వేముల మండల వైకాపా సాంబశివారెడ్డి డిమాండ్..



**వేముల మన జనప్రగతి ఆగస్టు 15:-** ఉపాధ్యాయులను శిక్షించడం కాదు..ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని..వేముల మండల వైకాపా కన్వీనర్ సాంబశివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధ్యాయుల ఆందోళనను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి తప్ప, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. **ఉద్యోగ భద్రత కోసమే ఢిల్లీకి వెళ్లారు..** ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో సేవలందిస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ నిబంధనలతో ఉద్యోగ భద్రత, పదోన్నతుల విషయంలో ఆందోళనకు గురవుతున్నారని సాంబశివారెడ్డి తెలిపారు. నియామక సమయంలో ఉన్న నిబంధనల ప్రకారం అర్హత సాధించి ఉద్యోగాల్లో చేరిన వారిని తిరిగి టెట్ పరీక్షకు హాజరుకావాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. టెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి, పార్లమెంట్ సభ్యులు, సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించేందుకు ఉపాధ్యాయులు ఢిల్లీకి వెళ్లారని చెప్పారు. ఇది వ్యక్తిగత ప్రయోజనం కోసం చేసిన ప్రయత్నం కాదని, వేలాది మంది ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య బద్ధంగా తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడమేనని పేర్కొన్నారు. **సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించాలి..!** ఉపాధ్యాయ సంఘ నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డిలను సస్పెండ్ చేయడం దారుణమని సాంబశివారెడ్డి అన్నారు. క్రమశిక్షణ చర్యలతో సమస్య పరిష్కారం కాదని, ఉపాధ్యాయుల్లో మరింత ఆందోళన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకుని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు భరోసా కల్పిస్తూ టెట్ సమస్యకు న్యాయమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సాంబశివారెడ్డి డిమాండ్ చేశారు.

# శ్రీ లక్ష్మీ పాలకొండ్రాయ స్వామి ఆలయానికి ఉచిత బస్సులు

**కడప మన జనప్రగతి ఆగస్టు 15:-** పవిత్ర శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని కడప నగరంలోని భక్తుల సౌకర్యార్థం పాత బస్టాండ్ నుంచి శ్రీ లక్ష్మీ పాలకొండ్రాయ స్వామి దేవస్థానం వరకు ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులను టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు కలగకుండా ఉచిత రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులంతా స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని, కడప నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ భక్తులు పాల్గొన్నారు.

# శ్రావణ శనివారం అంజన్నకు విశేష పూజలు

- ప్రత్యేక అలంకారంలో అభయ ఆంజనేయ స్వామి



**పులివెందుల అర్బన్ మన ప్రగతి ఆగస్టు 15:** పులివెందుల పార్నపల్లి రోడ్డు సమీపాన కొలువైయున్న కోతి సమాధి అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారాన్ని, పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధ లింగస్వామి ఆధ్వర్యంలో, స్వామివారికి పంచామృత అభిషేకాలు, ఆకు పూజ, సింధూర పూజ, ఆంజనేయ స్వామి అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం ఉభయదారులకు భక్తులకు సంకల్ప పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు శ్రీనివాసన్ రెడ్డి, అర్చకులు సిద్ధ లింగస్వామి మాట్లాడుతూ శ్రావణ శనివారాలలో కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి శనివారం మంగళవారాలలో స్వామివారు ప్రత్యేక అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారని, భక్తిశ్రద్ధలతో స్వామివారికి అభిషేకాలు విశేష పూజలు, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు ఎవరైనా శ్రావణమాసంలో స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించదలచిన వారు ఆలయ అర్చకులు సిద్ధ లింగస్వామి సంప్రదించవలెను తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుడు పెడబల్లె బాల ఎల్లారెడ్డిని సన్మానించిన తాసిల్దార్ విజయ కుమారి



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 15:-** 80వ స్వాతంత్ర దినోత్సవం లో భాగంగా చెన్నూరు కు చెందిన స్వాతంత్ర సమరయోధుడు 106 సంవత్సరాల పెడబల్లె బాల ఎల్లారెడ్డిని శనివారం ఉదయం చెన్నూరు మండల తాసిల్దార్ విజయ కుమారి వీఆర్వోలు వీఆర్ఏలు చెన్నూరు నాగలకట్ట వీధిలో ఉన్న పెడబల్లె బాల ఎల్లారెడ్డి నివాసానికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు, తాసిల్దార్ విజయకుమారి బాల ఎల్లారెడ్డికి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు, పండ్లు అందించారు, ఈ సందర్భంగా తాసిల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ కడప పోలీస్ పేరెంట్స్ గ్రౌండ్లో జరిగే ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎల్లారెడ్డికి ఆహ్వానం పంపారని కానీ ఆరోగ్యరీత్యా అక్కడికి ఆయన వెళ్లకపోవడంతో జిల్లా అధికారుల ఉత్తర్వులు మేరకు తామే స్వయంగా సమరయోధుడు బాల ఎల్లారెడ్డి ఇంటికి రావడం జరిగిందన్నారు, ఆయన ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని తమ కోరుకుంటున్నట్లు తెలిపారు,


# మండలంలో రెపరెపలాడిన మూడు రంగుల జాతీయ జెండా




**బొమ్మనహాళ్ మన జనప్రగతి ఆగస్టు 15:-** మండల పరిధిలో స్థానిక తహశీల్దార్, మండల ప్రజా పరిషత్, పోలీస్ స్టేషన్, వెలుగు, విద్యాశాఖ, అగ్రికల్చర్, హాస్పిటల్ అన్ని గ్రామాల సచివాలయాలు మరియు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తూ జెండాకు వందనం చేస్తూ ఆవిష్కరించారు, తహశీల్దార్ రఘు అధ్వర్యంలో సిబ్బందితో కలసి కార్యాలయ 80వ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిస్తూ, జాతీయ జెండాను ఎగరవేశారు, మండల ప్రజా పరిషత్ ఆవరణంలోని ఎంపీపీ ముల్లంగి నాగమణి నారాయణస్వామి, మరియు ఉపాధి హామీ, హౌసింగ్ పంచాయతీ కార్యదర్శులు కంప్యూటర్ ఆపరేటర్లు వివిధ సిబ్బంది అందరూ కలసి 80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా, అమరవీరులైన స్వతంత్ర సమరయోధుల, చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పిస్తూ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు, మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్ చేతుల మీదుగా మన దేశ స్వాతంత్ర సమరయోధులకు, పూలమాలవేసి నివాళులర్పిస్తూ, ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తూ జెండాను ఆవిష్కరించడం జరిగినది, విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు వీరన్న, మల్లికార్జున చేతుల మీదుగా స్వాతంత్ర సమరయోధుల పోటోలకు పూలమాల వేసి 80 వ స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా జాతీయ జెండా ఎగురేశారు, అదేవిదంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయం, హెల్త్ సిబ్బంది, ఆర్బికే సెంటర్లు, ఐకెపి ఆఫీస్, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలో అన్ని ప్రభుత్వ కార్యాలయం ముందు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా మూడు రంగుల జాతీయ జెండా రెపరెపలాడింది, ఈ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా అన్ని గ్రామంలలో అధికార పార్టీ ప్రతినిధులు, హాజరై జెండాను ఆవిష్కరిస్తూ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్వీట్లు పంచుకున్నారు.


# ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి

## - కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి



**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు15:-** వృద్ధులకు, రోగులకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి కలదని అన్నమయ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, విఆర్డీఎస్ సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. శనివారం వీరబల్లికి చెందిన శ్రీ దుగ్గనపల్లి కృష్ణారెడ్డి డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు క్రిష్ణారెడ్డి ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుమారుడు సురేంద్రరెడ్డి విఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధులకు, రోగులకు పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణి చేశారు. తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతామని, ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఆనందం అనేది వ్యక్తుల ద్వార, వస్తువుల ద్వార రాదని మీరు ఇతరులకు సహాయం చేయడం ద్వారానే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డికెఆర్ సిబ్బంది వెంకటరమణ, వైద్య సిబ్బంది వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలలో పనిచేయడానికి అర్హులు దరఖాస్తు చేసుకోండి



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 15:-** ప్రభుత్వ ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలతో చిట్వేలి మండలంలో సెప్టెంబర్ 2026 నుండి ఏప్రిల్ 2007 వరకు ఎనిమిది నెలల కాలానికి గానూ మండలం లోని ప్రాథమిక పాఠశాలలలో పనిచేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిదీన్ తెలిపారు. చిట్వేలి మండలం లోని ప్రాథమిక పాఠశాలలో 41 ఖాళీలు, ఉన్నత పాఠశాలలలో 4 ఖాళీలకు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ఆగస్టు నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఎంఈఓ తెలిపారు దరఖాస్తులు చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లకు ఎస్జీటీ పోస్ట్ కు నెలకు పదివేల రూపాయలు, స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ కు నెలకు 12,500 రూపాయలు గౌరవ వేతనం పారితోషికంగా చెల్లిస్తారని తెలిపారు. ఎస్జిటి పోస్టుకు డిఎడ్, స్కూల్ అసిస్టెంట్ కు బిఈడి చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుంది అని ఎంఈఓ ఖాజా మొహిదీన్ తెలిపారు.

# మండల ప్రజలకు 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మండల టిడిపి నాయకులు



**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు15:** మండలంలోని ప్రజలకు నాయకులకు, అధికారులకు మండల టిడిపి నాయకులు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా శనివారం వీరు మండలం లోని స్థానిక టిడిపి నాయకుడు రెడ్డప్పరెడ్డి గృహం నందు జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు నాయకులకు మండల అధికారులకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోటీడీపీ మండల అధ్యక్షుడు ముద్దలూరు భానుగోపాల్ రాజు, టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డప్ప రెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు రాయ వెంకటరమణ నాయుడు, జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, రామకృష్ణం రాజు, రామచంద్ర, పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- దేశభక్తి, ఐక్యతను చాటుతూ

## ఘనంగా తిరంగా ర్యాలీ

**కూకట్‌పల్లి మన జనప్రగతి ఆగస్టు 15:-** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం దేశభక్తి, ఐక్యత, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దేశభక్తి నినాదాలతో వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌కేఎస్ ఫౌండర్ రామకృష్ణ, ఎస్‌వీపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భగవంతాచారి, సమితి అధ్యక్షుడు చింత రాజేశ్వరరావు, కమిటీ అధ్యక్షుడు చింత వైకుంఠం, సమితి కోశాధికారి నాగేశ్వరరావు, కమిటీ సంయుక్త కార్యదర్శి బీవీఆర్ మూర్తి, సమితి సంయుక్త కార్యదర్శి వెంకటరావు, కమిటీ సభ్యులు మధుసూదన్, ప్రధానాచార్యులు రమేష్, ఆచార్యులు, మాతాజీలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. **జాతీయ సమైక్యతను చాటుతూ తిరంగా ర్యాలీ** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ కాలనీలో జాతీయ పతాకాలను చేతబూని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, ఐక్యతా భావాన్ని చాటుతూ ర్యాలీ సాగింది. తిరంగా ర్యాలీకి ముఖ్య అతిథిగా బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు హాజరయ్యారు. నాయకులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.





# స్వాతంత్ర్య సమరయోధుడు బాల యల్లారెడ్డికి ఘన సన్మానం

**నాటి త్యాగాల స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలి**

**అవినీతి, అక్రమాలపై ప్రజలు పోరాడాలి**

**నీతి, నిజాయితీ పరులకు అండగా నిలవాలి**

**బాల యల్లారెడ్డికి రెడ్యం పాదాభివందనం**



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 15:**-ఎలాంటి స్వార్థం లేకుండా దేశానికి స్వాతంత్ర్యం రావాలనే సదుద్దేశంతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాల యల్లారెడ్డి అని వైఎస్సార్‌సీపీ కార్యదర్శి,కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి కొనియాడారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం చెన్నూరులోని బాల యల్లారెడ్డి స్వగృహానికి వెళ్లిన రెడ్యం ఆయనను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.అనంతరం నాటి స్వాతంత్ర్య పోరాట విశేషాలను బాల యల్లారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ..నాడు తనకు,తన కుటుంబానికి ఏమి లభిస్తుందనే ఆలోచన లేకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన బాల యల్లారెడ్డి నేటి తరానికి స్ఫూర్తిప్రదాత అన్నారు.ఆయన స్ఫూర్తితో నేటి తరం అవినీతి,అక్రమాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.నీతి,నిజాయితీతో జీవించే వారికి మంచి జరిగేలా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.స్వాతంత్ర్యం రాకముందు దేశ ప్రజలంతా ఒక్కటై నిస్వార్థంగా పోరాడారని,స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయినా పేదలు పేదలుగానే మిగిలిపోవడం బాధాకరమన్నారు.అవినీతి,అక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అంతమొందించేందుకు మరో ప్రజా పోరాటం అవసరమని రెడ్యం పేర్కొన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు శెట్టిపల్లె సిద్ధారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ముత్తూరు వెంకట సుబ్బయ్య, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్, ఆర్ట్స్ కాలేజీ మాజీ చైర్మన్ మద్దిక నాగేశ్వరరెడ్డి, తవ్వా వెంకట సుబ్బారెడ్డి, పెడబల్లె విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**సైబరాబాద్ మన జనప్రగతి ఆగస్టు 15:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ హాజరయ్యారు. ముందుగా సీపీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" ఆలపించారు.ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక,భౌగోళిక,వాణిజ్య,సాంకేతిక మార్పులు,అంతర్జాతీయ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటూ స్వయం సమృద్ధి దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని సీపీ తెలిపారు.హైదరాబాద్,తెలంగాణ శాస్త్ర,సాంకేతిక,ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేష్,సైబరాబాద్ జాయింట్ సీపీ 'ట్రాఫిక్ 'సన్ ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్,కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్,డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్.సుధీంద్ర,ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్,సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ ఏడీసీపీలు,ఏసీపీలు,పోలీస్ ఉన్నతాధికారులు,సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు మొదలైన వారు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి: వేంపల్లె ఈవో సుభాష్



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 15:**-ఆలయాల అభివృద్ధి దాతలు సహకరించాలని వేంపల్లి వృషభాషలేశ్వర దేవస్థాన ఈవో కడప సుభాష్ అన్నారు.శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా స్థానిక పాపాగ్ని నదీ తీరాన ఎద్దుల కొండపై వెలసిన వృషభాచలేశ్వర స్వామికి అర్చకుడు హరి ప్రవీణ్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు విశేష అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ మేరకు సదరు భక్తులకు ఆలయ పాలకమండలి సభ్యుడు నాగిశెట్టి సునీల్ కుమార్ సుహాసిని దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ మేరకు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతి శనివారం ఎద్దుల కొండపై దాతల సాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టామన్నారు. ఈ విషయమై ఆసక్తి ఉన్న దాతలు తమను సంప్రదించాలని కోరారు. ఎద్దుల కొండపై మూడవ శనివారం వృషబాచలేశ్వర స్వామి పద్మావతి అమ్మవారి లకు కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర వేడుకలు

**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు 15:**- మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో శనివారం 80వ స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా ప్రతి కార్యాలయాల్లో పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేసి జండా వందనం చేశారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర వేడుకలలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఆయన జాతీయ జెండాలు ఎగరవేసి జండా వందనం చేశారు. మండలములోని అన్ని శాఖల అధికారులు, ఉపాధ్యాయులు,అధ్యాపకులు,సచివాలయం సిబ్బంది,పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా కడప జిల్లా కమిటీ ఏర్పాటు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 15:**-నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్. జ్యోతిశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, సంస్థ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.కడప జిల్లా కమిటీలో ఎర్రగుంట్లకు చెందిన బేరి రామయ్యను జిల్లా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా, ప్రొద్దుటూరుకు చెందిన బిర్రు సురేష్‌ను జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా, గంగారపు రవి కిరణ్ బాబును జిల్లా అదనపు వైస్ ప్రెసిడెంట్‌గా, దువ్వూరు మండలం మాచనపల్లికి చెందిన నొస్సం రమేష్‌ను జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించినట్లు డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా స్థాయి కార్యనిర్వాహక బాధ్యతలు స్వీకరించిన సభ్యులు మాట్లాడుతూ, సంస్థ తమపై అప్పగించిన బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కడ న్యాయం ఉండి అన్యాయం జరుగుతుందో అక్కడ బాధితులు, పేద ప్రజల పక్షాన నిలబడి సంస్థ తరపున న్యాయం కోసం పోరాడుతామని పేర్కొన్నారు.జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి మరియు నేరాల నియంత్రణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. తమకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించిన నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్. జ్యోతిశ్వర్ రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్లకు నూతనంగా నియమితులైన జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రెపరెపలాడిన త్రివర్ణ పతాకం



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 15:**-మండల పరిధిలోని అన్ని గ్రామాల గవర్నమెంట్ ఆఫీసుల నందు స్కూల్లలో 80 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఉద్యోగస్తులు మరియు ప్రజలు త్రివర్ణ పతాక వేడుకలు ఘనంగా నిర్వహించారు.80వగణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో,ఎంపీడీవో కార్యాలయంలో తాసిల్దార్ కార్యాలయంలో అలాగే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆయా కార్యాలయాల్లో వారి సిబ్బందితో జాతీయ పతాకాన్ని ఉదయము ఎనిమిది గంటలకు ఎగరవేశారు.మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా సంబంధిత ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల నందు ప్రిన్సిపాల్ జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించడం జరిగింది.ఆయన మాట్లాడుతూ మన భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన సమరయోధుల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్‌కు ఉత్తమ అవార్డు



**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు15:**-మండల కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియం గా పనిచేస్తున్న కల్పనాకు ఉత్తమ సేవా అవార్డు అందుకున్నట్లు వైద్యాధికారి జియా తెలిపారు.శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కడప జిల్లా డీఎంహెచ్వో చేతుల మీదుగా ఈ ఉత్తమ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందిస్తూ విధి నిర్వహణలో క్రమం తప్పకుండా హాజరవుతూ సర్వీస్ చేసినందుకు ఈ అవార్డు వచ్చిందని వైద్యాధికారి తెలిపారు.


## పులివెందుల డీఎస్పీ బి.మురళీ నాయక్‌కు ఉత్తమ సేవా పురస్కారం



**కడప/పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 15:**శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలందిస్తున్న పులివెందుల డీఎస్పీ బి.మురళీ నాయక్ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రతిష్టాత్మక 'ఉత్తమ డీఎస్పీ' అవార్డును అందుకున్నారు.జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్,జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్,రాష్ట్ర మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ ప్రశంసా పత్రాన్ని,పురస్కారాన్ని స్వీకరించారు.పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాల అణచివేతతో పాటు ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంలో మురళీ నాయక్ చూపిన చొరవకు గాను ఈ గుర్తింపు లభించింది.ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణమే స్పందిస్తూ,సమర్థవంతమైన పోలీసింగ్ వ్యవస్థను నడపడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.డీఎస్పీ మురళీ నాయక్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించడం పట్ల సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు,ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది,పలువురు ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వం,సిబ్బంది సమష్టి కృషి వల్లే ఈ పురస్కారం దక్కిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలందిస్తామని పేర్కొన్నారు.

## 26 నెలల నుంచి రాష్ట్రంలో స్వాతంత్ర్యం ఎక్కడుంది..?

**కూటమి ప్రభుత్వ పాలనపై రాచమల్లు శివప్రసాదరెడ్డి హాట్ కామెంట్స్**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 15:**-భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినప్పటికీ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని కోల్పోయి 26 నెలలు అవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆరాచక పాలన సాగిస్తోందని, గత 26 నెలలుగా ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు లేవని ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర పాలకుల కంటే బ్రిటిష్ పాలకులే నయమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దోపిడీ, జైళ్లు, అప్పులు తప్ప ప్రజలకు స్వాతంత్ర్యం ఎక్కడ ఉందని ప్రశ్నించారు.మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా రాష్ట్రంలో మూడు అత్యాచారాలు, ఆరు హత్యలు అన్న పరిస్థితి నెలకొందని రాచమల్లు ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పాలకులు గంజాయి, మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో పాలకులకు స్వేచ్ఛ ఉందని, కానీ ప్రజలకు మాత్రం స్వేచ్ఛ లేదని అన్నారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించిన ఆయన.. తన చేతిలోని రెడ్‌బుక్‌ను పక్కనపెట్టి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పట్టుకుంటే తాను హర్షిస్తానని వ్యాఖ్యానించారు. ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రావాలంటే ప్రతి ఇంటి నుంచి ఒక మహాత్మాగాంధీ, ఒక భగత్‌సింగ్ పుట్టాల్సిన అవసరం ఉందని, అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని అన్నారు. 2029 ఎన్నికల్లో ప్రజలు మహాత్మాగాంధీ, భగత్‌సింగ్ స్ఫూర్తితో తమ ఓటు హక్కును వినియోగించుకుని పాలకులకు తగిన సమాధానం చెప్పాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు.

## క్రమశిక్షణ,సేవాభావం,ప్రతిభకు గుర్తింపు ఈ అవార్డు.

**- ఉత్తమ కంప్యూటర్ ఆఫరేటర్‌గా నరసింహ రెడ్డి**

**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 15:**-గాలివీడు మండల విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహారెడ్డి "ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్"గా ఎంపికై సత్కారం అందుకున్నారు.దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రం మదనపల్లి లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా,యువజన, క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా బి. నర్సింహారెడ్డి ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డును అందుకున్నారు.విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ సంబంధిత పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల వివరాలు, పాఠశాలల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడంలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం మరియు ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 15:**-దేవనకొండ మండలంలోని జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మౌనిక, కరస్పాండెంట్ కాసిం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి, దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174